జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక
సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

ఆదివారం 15 ఫిబ్రవరి 2026 | పేజీలు 04 | వెల : రూ 2/- | సంపుటి 1, సంచిక : 259 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : కాసే అమృత

## తెలంగాణ వ్యవసాయ శాఖలో ఔట్‌సోర్సింగ్ నియామకాలు: ఏజెన్సీల నుండి దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, సందేశం టైమ్స్ రిపోర్టర్ శెట్టి వెంకటేష్: తెలంగాణ రాష్ట్రంలో భారత ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త భాగస్వామ్యంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేయబడుతున్న జాతీయ ప్రకృతి వ్యవసాయ పథకాన్ని మరింత సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు వ్యవసాయ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ పథకం అమలును క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు ఒక (01) ప్రాజెక్ట్ ఆఫీసర్ మరియు ఒక (01) అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ పోస్టులను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేయాలని నిర్ణయించినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో, అర్హత కలిగిన అభ్యర్థులను సరఫరా చేయగల సామర్థ్యం ఉన్న గుర్తింపు పొందిన ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు తక్షణమే స్పందించాలని, సంబంధిత పోస్టులకు అవసరమైన సిబ్బంది వివరాలను అందజేయాలని కోరడమైనది. ఈ నియామకాలకు సంబంధించి అభ్యర్థులకు ఉండవలసిన విద్యార్హతలు, నిర్దేశించిన జీతభత్యాలు, అనుభవం మరియు ఇతర ఎంపిక నిబంధనల గురించి పూర్తి సమాచారం కోసం ఆసక్తి గల ఏజెన్సీలు హైదరాబాద్‌లోని వ్యవసాయ శాఖ డైరెక్టర్ కార్యాలయాన్ని నేరుగా సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని ఈ పత్రికా ప్రకటన ద్వారా స్పష్టం చేశారు.




## రాష్ట్ర ప్రజలకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మహా శివరాత్రి శుభాకాంక్షలు

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి శెట్టి వెంకటేష్: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ పవిత్రమైన రోజున రాష్ట్రంలోని ప్రతి ఇల్లు భక్తి భావంతో విరాజిల్లాలని మరియు ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆ మహాదేవుడిని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ సుభిక్షంగా ఉండాలని, ఉపవాస దీక్షలు మరియు జాగరణలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులందరిపై ఆ భోళాశంకరుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుతూ, ఈ ఆధ్యాత్మిక పర్వదినం ప్రజల మధ్య సోదరభావాన్ని పెంపొందించి రాష్ట ప్రగతికి బాటలు వేయాలని తన సందేశంలో ఆకాంక్షించారు.

## బంజారా భవన్‌లో ఘనంగా సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలు

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి శెట్టి వెంకటేష్: లంబాడీ గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలు ఈ నెల 15వ తేదీ ఆదివారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ సేవాలాల్ బంజారా భవన్‌లో అత్యంత వైభవంగా జరగనున్నాయని గిరిజన సంక్షేమ శాఖామాత్యులు శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఈ వేడుకల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులతో పాటు గిరిజన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మరియు ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని, గిరిజన సాంప్రదాయ పద్ధతిలో భోగ్ భండార్ కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు మరియు హస్తకళల ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి శ్రీ అనుముల రేవంత్ రెడ్డి గారు గతంలోనే ఈ ఉత్సవాల బడ్జెట్‌ను కోటి రూపాయల నుండి రెండు కోట్లకు పెంచడంతో పాటు బంజారా ఉద్యోగులకు ఫిబ్రవరి 15న ప్రత్యేక సెలవు మంజూరు చేశారని గుర్తు చేసిన మంత్రి, ఈ నెల 15 నుండి 21 వరకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో జరగనున్న ఉత్సవాల కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని వెల్లడించారు. ఈ చారిత్రాత్మక వేడుకలను విజయవంతం చేయాలని గిరిజన ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు మరియు మీడియా మిత్రులకు గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ తరపున ఆహ్వానం పలుకుతున్నట్లు ఈ సందర్భంగా ప్రకటించారు.

## రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహా శివరాత్రి శుభాకాంక్షలు



హైదరాబాద్, సందేశం టైమ్స్ రిపోర్టర్ శెట్టి వెంకటేష్: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, రాష్ట్ర ప్రజలందరికీ ఆ పరమశివుడు ఆయురారోగ్యాలను, సుఖ సంతోషాలను ప్రసాదించాలని ఆ మహా దేవుడిని మనసారా ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. మహా శివరాత్రి పర్వదినం వేళ అత్యంత భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు, జాగరణలు మరియు ప్రత్యేక పూజలు నిర్వహించే భక్తులందరిపై ఆ భోళా శంకరుడి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ఆకాంక్షించారు. శివయ్య అనుగ్రహంతో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోవాలని, ప్రతి ఇంటా వెలుగులు నిండాలని ముఖ్యమంత్రి తన సందేశంలో ఆశీర్వదించారు.




## వాయిల సింగారంలో ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కోదాడ ప్రతినిధి ఫిబ్రవరి 15 సందేశం టైమ్స్ ,సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం వాయిల సింగారం గ్రామంలో పూర్వ విద్యార్థులు 2005-06 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు 20సంవత్సరాల అనంతరం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం మండలంలోని వాయిల సింగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో అట్టహాసంగా జరిగింది.పూర్వ విద్యార్థులు తమకు విద్యను బోధించిన ఆ నాటి స్కూల్ ప్రిన్సిపాల్ మస్తాన్,ఉపాధ్యాయులు , గోపతి వెంకటేశ్వర్లు, కర్ణం సాయబ్ ,ఎస్ కృష్ణయ్య ,కర్ణ మేడం, సిద్ధార్థ ,రామారావు, గురువులు పాల్గొని,తమ శిష్యులను చూసి ఆనందం వ్యక్తం చేశారు.వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 40 మంది పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని,తమ పాఠశాల రోజుల మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.ఈ సందర్భంగా గురువులను శాలువాలతో సత్కరించి, వారి అమూల్యమైన బోధనలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ ప్రైమరీ స్కూల్ కే పరిమితమైన పాఠశాలను ప్రిన్సిపాల్ మస్తాన్ హయాంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏర్పాటుకు ఆయన కృషి ఎంతో ఉందన్నారు.విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంలో గురువుల పాత్ర అనిర్వచనీయమని,స్నేహభావంతో పూర్వ విద్యార్థులందరికీ మరపురాని అనుభూతిని మిగిల్చిందని వారు తెలిపారు.ఈ ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## టీజీ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ: ఫిబ్రవరి 22 లోగా దరఖాస్తుకు ఆహ్వానం

సంగారెడ్డి, సందేశం టైమ్స్ ప్రతినిధి శెట్టి వెంకటేష్: సంగారెడ్డి జిల్లాలోని స్థానిక టీజీ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్ 1, 2, 3, 4తో పాటు ఆర్ఆర్బీ, ఎస్ఐ, కానిస్టేబుల్, ఎస్ఎస్సీ వంటి వివిధ పోటీ పరీక్షలకు సంబంధించి 5 నెలల ఫౌండేషన్ కోర్సు ద్వారా ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ డాక్టర్ బి. శ్రీకాంత్ తెలిపారు. డిగ్రీ పూర్తి చేసి, వార్షిక ఆదాయం 3 లక్షల లోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు ఈ ఉచిత శిక్షణకు అర్హులని, ఆసక్తి గల వారు ఫిబ్రవరి 22వ తేదీలోగా tsstudycercle.co.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మార్చి 1వ తేదీన ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు స్థానిక ప్రతిభ డిగ్రీ కళాశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుందని, ఈ పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా 100 మంది అభ్యర్థులను ఎంపిక చేసి వారికి ఐదు నెలల పాటు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ సౌకర్యం కల్పిస్తామని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు.


# ఈ నెల 20వ తేదీ వరకే సీ.సీ.ఐ. పత్తి కొనుగోళ్లు: జిల్లా మార్కెటింగ్ అధికారి కోటా నాగేశ్వర శర్మ

సందేశం టైమ్స్ , సూర్యాపేట ప్రతినిధి శెట్టి వెంకటేష్: జిల్లాలోని పత్తి రైతులకు భారత పత్తి నిగమం (సీ.సీ.ఐ.) ద్వారా పత్తి కొనుగోలు ప్రక్రియ ఈ నెల 20వ తేదీ వరకు మాత్రమే కొనసాగుతుందని సూర్యాపేట జిల్లా మార్కెటింగ్ అధికారి కోటా నాగేశ్వర శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. కపాస్ కిసాన్ యాప్‌లో ఇప్పటికే రిజిస్టర్ చేసుకున్న రైతులు వెంటనే తమ స్లాట్ బుక్ చేసుకోవాలని ఆయన సూచించారు. 20వ తేదీ లోపు సీ.సీ.ఐ. కేంద్రాల్లో పత్తిని విక్రయించి మద్దతు ధర పొందాలని, గడువు ముగిసిన తర్వాత కొనుగోళ్లు ఉండవని ఆయన స్పష్టం చేశారు.

# ఫీజుల పేరుతో హాల్ టికెట్లు ఆపితే కఠిన చర్యలు: పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా



పల్నాడు, సందేశం టైమ్స్ ప్రతినిధి శెట్టి వెంకటేష్: ఈ నెల ఫిబ్రవరి 23 నుండి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణ మరియు ఇటీవల ముగిసిన ప్రీ-పబ్లిక్ పరీక్షల ఫలితాలపై జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏ కళాశాల యాజమాన్యమైనా ఫీజులు చెల్లించలేదనే సాకుతో విద్యార్థుల హాల్ టికెట్లను ఆపినా లేదా వారిని ఒత్తిడికి గురిచేసినా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె ఈ సందర్భంగా హెచ్చరించారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను బోర్డ్ అధికారిక వెబ్‌సైట్ నుండి లేదా 9552300009 అనే 'మన మిత్ర' (MANA MITHRA) వాట్సాప్ నంబర్ ద్వారా సులభంగా పొందవచ్చని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల పనితీరును విశ్లేషిస్తూ, విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించిన కలెక్టర్, పరీక్షల సమయంలో విద్యార్థులకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు.



# తెలుగు రాష్ట్రాల్లో మొదలుకానున్న పెళ్లిళ్ల సందడి: వివాహాలకు శుభ ముహూర్తాలివే

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి శెట్టి వెంకటేష్: తెలుగు రాష్ట్రాల్లో త్వరలో పెళ్లిళ్ల సందడి మొదలుకానుంది, ఈ నెల 17వ తేదీతో శుక్ర మౌఢ్యమి ముగియనుండటంతో ఫిబ్రవరి 19వ తేదీ నుండి వివాహాలకు అత్యంత శుభప్రదమైన ముహూర్తాలు ప్రారంభం కానున్నాయని పండితులు పేర్కొంటున్నారు. ఫిబ్రవరి నెలలో 19, 20, 21, 24, 25, 26 తేదీల్లో ముహూర్తాలు ఉండగా, మార్చిలో 1, 3, 4, 7, 8, 9, 11, 12 తేదీలు అనుకూలంగా ఉన్నాయని, అదేవిధంగా ఏప్రిల్ నెలలో 15 నుండి 29 వరకు పలు తేదీల్లో శుభకార్యాలు నిర్వహించుకోవచ్చని వారు తెలిపారు. మే నెలలో 1 నుండి 14 వరకు, జూన్ నెలలో 21 నుండి 29 వరకు వరుస ముహూర్తాలు ఉండగా, జూలైలో 1, 6, 7, 11 తేదీలు మరియు తిరిగి నవంబర్‌లో 21, 24, 25, 26 తేదీలతో పాటు డిసెంబర్‌లో 2 నుండి 12వ తేదీ వరకు వివాహాలకు మంచి సమయమని పండితులు వివరించారు.

# అమర వీరుల జ్ఞాపకం: పుల్వామా వీరగాథకు భారతావని ఘన నివాళి

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి శెట్టి వెంకటేష్: ఫిబ్రవరి 14, 2019న జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిపై జరిగిన పుల్వామా ఆత్మాహుతి దాడిలో మాతృభూమి రక్షణ కోసం ప్రాణాలర్పించిన 40 మంది వీర జవాన్ల త్యాగాలను దేశం నేడు స్మరించుకుంటోంది. సుమారు 2,500 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు సెలవులు ముగించుకుని విధులకు హాజరవుతున్న తరుణంలో జరిగిన ఈ భీకర దాడి భారతావనిని ఉలిక్కిపడేలా చేయగా, దేశం కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా

భారతీయుడి గుండెల్లో చెదరని ముద్ర వేసింది. ఒక తల్లికి ఆసరాగా, భార్యకు తోడుగా, బిడ్డలకు మార్గదర్శకులుగా ఉన్న ఆ సైనికుల అసమాన ధైర్యం మరియు త్యాగం ముందు హిమాలయాలు కూడా తలవంచుతాయని, భౌతికంగా వారు మన మధ్య లేకపోయినా వారి కీర్తి చరిత్ర పుటల్లో అమరమై నిలుస్తుందని పేర్కొంటూ, దేశ స్వేచ్ఛ కోసం ప్రాణాలర్పించిన ఆ వీర జవాన్లకు భారతావని అశ్రునయనాలతో ఘన నివాళులు అర్పిస్తోంది.



# ప్రేమ పేరుతో వంచించే పోకిరీల పట్ల అప్రమత్తంగా ఉండాలి: సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ శేషాద్రి రెడ్డి


హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి శెట్టి వెంకటేష్: ఫిబ్రవరి 14, వాలెంటైన్స్ డే సందర్భంగా ప్రేమ పేరుతో కొంతమంది పోకిరీలు నయవంచనకు పాల్పడి అమ్మాయిల జీవితాలతో ఆటలాడుకుంటారని, అటువంటి వారి పట్ల విద్యార్థినులు, యువతులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ-2 శేషాద్రి రెడ్డి హెచ్చరించారు. ఇటీవల సోషల్ మీడియా ప్రభావం పెరిగి ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికల ద్వారా పరిచయాలు పెంచుకుంటున్న మృగాలు ప్రేమ పేరుతో వంచనకు గురిచేస్తున్నారని, వారి మాటలు నమ్మి ఇళ్ల నుండి బయటకు వస్తున్న చిన్నారులు దాడులకు గురవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వాలెంటైన్స్ డే సందర్భంగా హోటల్ యజమానులు యువతీ యువకులకు గదులు ఇచ్చేటప్పుడు వారి గుర్తింపు పత్రాలను తప్పనిసరిగా క్రాస్ చెక్ చేసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే పోలీసు తనిఖీల్లో పట్టుబడిన పక్షంలో చట్టప్రకారం కఠిన శిక్షలు తప్పవని డీసీపీ శేషాద్రి రెడ్డి హోటల్ యజమానులను గట్టిగా హెచ్చరించారు.

# కర్ణాటకలో లోకాయుక్త మెరుపు దాడులు: ఇంజనీర్ల ఇళ్లలో కోట్లాది రూపాయల నగదు, ఆస్తులు గుర్తింపు



బెంగళూరు, సందేశం టైమ్స్ ప్రతినిధి శెట్టి వెంకటేష్: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో భాగంగా కర్ణాటక లోకాయుక్త అధికారులు ఇద్దరు ఉన్నతాధికారుల ఇళ్లపై నిర్వహించిన సోదాలు రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించాయి. కర్ణాటక రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ అసోసియేషన్ (KREIS) సూపరింటెండింగ్ ఇంజనీర్ హెచ్.ఎం. జనార్దన్ లక్ష్యంగా ఆరు ప్రాంతాల్లో జరిగిన దాడుల్లో, ఆయన స్నేహితుడు సుజయ్ శెట్టి నివాసంలో ఏకంగా రూ.1.70 కోట్ల నగదు లభించగా, నోట్ల కట్టలను లెక్కపెట్టేందుకు యంత్రాలు వాడాల్సి వచ్చిందని అధికారులు వెల్లడించారు. మరోవైపు పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (PWD) చీఫ్ ఇంజనీర్ పురుషోత్తం నివాసంలో జరిగిన సోదాల్లో భారీగా బంగారం, నగదు మరియు విలువైన పత్రాలను స్వాధీనం చేసుకున్నారని, మొత్తం మీద నలుగురు అధికారులకు సంబంధించి సుమారు రూ.23 కోట్లకు పైగా అక్రమ ఆస్తులను గుర్తించినట్లు లోకాయుక్త వర్గాలు స్పష్టం చేశాయి. అవినీతిపై కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తామని పేర్కొంటూ అధికారులు విచారణను మరింత వేగవంతం చేయడంతో పరిపాలనా వర్గాల్లో తీవ్ర కలకలం రేగుతోంది.

# బ్రహ్మపుత్ర నది కింద దేశంలోనే తొలి వ్యూహాత్మక రైలు-రోడ్డు సొరంగ మార్గానికి కేంద్రం ఆమోదం





అస్సాం, సందేశం టైమ్స్ ప్రతినిధి శెట్టి వెంకటేష్: అస్సాంలోని బ్రహ్మపుత్ర నది కింద దేశంలోనే మొట్టమొదటి వ్యూహాత్మక రైలు-రోడ్డు సొరంగ మార్గం (Rail-cum-Road Tunnel) నిర్మాణానికి కేంద్ర మంత్రివర్గం నిన్న ఫిబ్రవరి 13, 2026న చారిత్రాత్మక ఆమోదం తెలిపింది. సుమారు ₹18,662 కోట్ల భారీ అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ మెగా ప్రాజెక్టు అస్సాంలోని గోహ్పూర్ (NH-15) మరియు నుమలీగఢ్ (NH-715) ప్రాంతాలను అనుసంధానిస్తుందని, మొత్తం 33.7 కిలోమీటర్ల పొడవున్న ఈ ప్రాజెక్టులో నది కింద ఉండే సొరంగం పొడవు 15.79 కిలోమీటర్లు ఉంటుందని కేంద్రం వెల్లడించింది. భారతదేశంలోనే మొదటి 'అండర్ వాటర్ రోడ్-కమ్-రైల్' టన్నెల్ కావడం దీని ప్రత్యేకత అని, ప్రపంచంలోనే ఇలాంటి నిర్మాణం ఇది రెండోదని పేర్కొంటూ, ఈ ప్రాజెక్టు పూర్తయితే ఈశాన్య రాష్ట్రాల రవాణా వ్యవస్థ మరియు వ్యూహాత్మక భద్రతలో కీలక మార్పులు రానున్నాయని అధికారులు స్పష్టం చేశారు.

# సీఎం చంద్రబాబు మరియు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను కలిసిన మహిళా ఎమ్మెల్యేలు





అమరావతి, సందేశం టైమ్స్ ప్రతినిధి శెట్టి వెంకటేష్: అమరావతి వెలగపూడి అసెంబ్లీలో జరుగుతున్న బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీలోని ముఖ్యమంత్రి ఛాంబర్‌లో సీఎం నారా చంద్రబాబు నాయుడును కూటమి మహిళా ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర బడ్జెట్‌లో మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ 'తల్లికి వందనం', 'దీపం 2.0' మరియు 'స్త్రీ శక్తి' వంటి పథకాలకు భారీగా నిధులు కేటాయించడం పట్ల వారు ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు క్షేత్రస్థాయిలో అద్భుతమైన ఫలితాలను ఇస్తున్నాయని ఈ సందర్భంగా చర్చించిన మహిళా ప్రజాప్రతినిధులు, తమ నియోజకవర్గాల్లోని అభివృద్ధి పనుల గురించి కూడా సీఎంతో మాట్లాడారు. అదేవిధంగా, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌ను కూడా సహచర మహిళా ప్రజాప్రతినిధులు కలిసి పలు అంశాలపై చర్చించారు.



## రాంసానిపల్లిలో వైభవంగా శ్రీ భ్రమరాంభ మల్లికార్జున స్వామి ఉత్సవాలు

అందోల్, సందేశం టైమ్స్ ప్రతినిధి టీ సంగమేశ్వర్: సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం రాంసానిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ భ్రమరాంభ మల్లికార్జున స్వామి ఆలయ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఫిబ్రవరి 15వ తేదీ ఆదివారం ఉదయం 11 గంటలకు బోనాలు, మధ్యాహ్నం 12:30 గంటలకు స్వామివారి కళ్యాణ మహోత్సవం నిర్వహించి అదేరోజు సాయంత్రం 5 గంటలకు భక్తిశ్రద్ధలతో అగ్నిగుండాల కార్యక్రమం నిర్వహించబడుతుందని, అనంతరం ఫిబ్రవరి 16వ తేదీ సోమవారం జాతర బండ్లు తిరుగుతాయని పేర్కొన్నారు. సోమవారం రాత్రి 8 గంటలకు శ్రీ శివకోటి శివాలయం వద్ద రథోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపిన ఆలయ నిర్వాహకులు, గ్రామ ప్రజలందరూ ఈ వేడుకల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.



## నారాయణఖేడ్: బోరంచ నుండి ఝరసంగం వరకు శివ స్వాముల భక్తి పాదయాత్ర

నారాయణఖేడ్, సందేశం టైమ్స్ ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం మానూర్ మండలం బోరంచ గ్రామంలోని ప్రాచీన శ్రీ భోగేశ్వరాలయం నుండి శనివారం శివ మాలధారణ స్వాముల పాదయాత్ర అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభమైంది. సుమారు 20 మంది శివ స్వాములు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఝరసంగం పుణ్యక్షేత్రం దిశగా రెండు రోజుల పాదయాత్రకు బయలుదేరగా, గ్రామ పెద్దలు మరియు భక్తులు వారికి ఘనంగా వీడ్కోలు పలికారు. సమాజంలో ఐక్యత, శాంతి మరియు సత్సంప్రదాయాల పెంపొందింపు లక్ష్యంగా భజనలు, హరినామ స్మరణలతో సాగుతున్న ఈ యాత్రలో భాగంగా శ్రీ లక్ష్మీనరసింహ మోటార్స్ ఆధ్వర్యంలో అల్పాహారం మరియు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పరమశివుని కృప కోసం నియమ నిష్టలతో సాగుతున్న ఈ పాదయాత్ర మార్గమధ్యంలో భక్తులు నీరు, ప్రసాదాలు అందజేస్తూ తమ భక్తిని చాటుకుంటుండటంతో ఆయా ప్రాంతాల్లో ఆధ్యాత్మిక ఉత్సాహం వెల్లివిరిసింది.









## మున్సిపల్ ఎన్నికల్లో విజయదుందుభి మోగించిన చిట్టిబాబు రెండు వార్డులు గెలిపించడంలో కీలకపాత్ర

### చిట్టిబాబును అభినందించిన మంత్రి దామోదర్

జోగిపేట -అందోలు15( సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్ )జోగిపేట మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాల్లో 15వ వార్డు కౌన్సిలర్‌గా 205 ఓట్ల మెజార్టీతో విజయదుంధిబి మోగించారు. గత ఎన్నికల్లో 17వ వార్డులో గెలుపొందిన చిట్టిబాబు ఈ సారి రిజర్వేషన్ అనుకూలించక 15వ వార్డు నుంచి పోటీ చేయడంతో ఆ వార్డులోని మైనార్టీలు, రజకులు, ఆర్యవైశ్య, ముదిరాజ్ సోదరులు ఆదరించడంతో బీఆర్ఎస్ అభ్యర్థిపై అవలీలగా గెలుపొందారు. రెండవ సారి కౌన్సిలర్‌గా ఎన్నికైన సందర్భంగా వార్డుకు చెందిన ప్రజలు, యువకలు, మైనార్టీలు కౌంటింగ్ కేంద్రం వద్ద నుంచి రోడ్డుపై ర్యాలీని నిర్వహించారు. బ్యాండు మేళాలతో, బాణా సంచాలు కాలుస్తూ ముందుకు కదిలారు. అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చిన కార్యకర్తలు ఆయనను అభినందించారు. శాలువలు, పూలదండలతో సన్మానించారు.

చిట్టిబాబును అభినందించిన మంత్రి దామోదర

15వ వార్డు కౌన్సిలర్‌గా గెలుపొందిన చిట్టిబాబును రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సి.దామోదర్ రాజనర్సింహ అభినందించారు. 15వ వార్డుతో పాటు 17వ వార్డులో ఎస్‌టీ అభ్యర్థిని గెలిపించడంలో కీలకపాత్ర పోషించిన విషయం తెలిసిందే. ఐదేళ్లుగా ఈ అవార్డులో అనేక సంక్షేమ కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలను చేపట్టడంతో కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా మారిన విషయం కూడా అందరికి తెలిసిందే. దీంతో ఈ వార్డును గెలిపించే బాధ్యతను చిట్టిబాబుపై మంత్రి దామోదర్ ఉంచారు. మంత్రి ఆదేశాలతో తాను అభ్యర్థిగా నిలిచిన వార్డుతో పాటు 17వ వార్డులో అభ్యర్థి గెలుపు కృషి చేసి విజయంలో కీలకపాత్ర పోషించారు.

# గీత కార్మికుల సమస్యలపై 17న ఇందిరాపార్క్ వద్ద నిరాహార దీక్ష అంజాగౌడ్ పిలుపు



నారాయణఖేడ్, సందేశం టైమ్స్ నారాయణఖేడ్ నియోజకవర్గం ఇంచార్జ్ టి చంద్రశేఖర్: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణంలోని అంబేద్కర్ భవనంలో గీత కార్మిక సంఘం డివిజన్ గౌరవ అధ్యక్షుడు నరసింహా గౌడ్ అధ్యక్షతన జరిగిన కమిటీ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు అంజాగౌడ్ పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులకు మరియు గౌడ సోదరులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, వారి సంక్షేమం కోసం బడ్జెట్‌లో రూ.5,000 కోట్లు కేటాయించాలని, పెండింగ్‌లో ఉన్న 800 మందికి రూ.14 కోట్ల ఎక్స్‌గ్రేషియా విడుదల చేయాలని మరియు గత బడ్జెట్ నిధులను వెంటనే ఖర్చు చేయాలని కోరారు. అర్హులైన గీత కార్మికులకు రూ.4,000 పెన్షన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేస్తూ, ఈ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 17న ఇందిరా పార్క్ వద్ద రాష్ట్ర కమిటీ నిర్వహించనున్న నిరాహార దీక్షకు గీత కార్మికులు, గౌడ సోదరులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు జయరామచంద్ర గౌడ్, విట్టల్దాస్ గౌడ్, భూమా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




## ఫార్మసిస్ట్ కుటుంబానికి రూ.1.50 లక్షల ఫిక్స్డ్ డిపాజిట్ అందజేత

జోగిపేట ఫిబ్రవరి 15( సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్ )సెప్టెంబర్ 2023లో జోగిపేట్ ఏరియా హాస్పిటల్లో ఫార్మసిస్ట్‌గా విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మృతిచెందిన రాము గారి కుటుంబానికి సహాయార్థం వైద్య విధాన పరిషత్ ఫార్మసిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.1,50,000లను వారి కుమార్తె పేరుపై పోస్టాఫీస్ ఫిక్స్డ్ డిపాజిట్‌గా చేసి అందజేశారు. ఈ కార్యక్రమం సంగారెడ్డి డీసీహెచ్ఎస్ డా. షరీఫ్ సమక్షంలో నిర్వహించబడింది. అదేవిధంగా హాస్పిటల్ సిబ్బంది సమీకరించిన రూ.43,000 డిపాజిట్ పత్రాలను హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. సౌజన్య అందజేశారు. రాము కుటుంబానికి కారుణ్య నియామకం కల్పించి ఆదుకోవాలని సంబంధిత అధికారులను సంఘం ప్రతినిధులు కోరారు. కార్యక్రమంలో ఆర్ఎంఒ డా. అశోక్, నర్సింగ్ సూపరింటెండెంట్లు పూలమాంబ, సునంద, ఫార్మసిస్ట్ యూనియన్ నాయకులు సోమమల్లన్న, పాండు, పరాబ్ కుమార్, రామారావు, శివకుమార్, సెల్వరాణి తదితరులు పాల్గొన్నారు.

# నారాయణఖేడ్ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ విజయం – 142 ఓట్ల మెజారిటీతో పత్రి లలిత రామకృష్ణ గెలుపు



నారాయణఖేడ్ ఫిబ్రవరి 15(సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్)సంగారెడ్డి జిల్లా నారాయణ ఖేడ్ మున్సిపల్ 1వ వార్డు ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి పత్రి లలిత రామకృష్ణ 142 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థిపై స్పష్టమైన ఆధిక్యం సాధించిన ఆమె గెలుపుతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ఫలితాలు వెల్లడైన వెంటనే కార్యకర్తలు బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుతూ సంబరాలు నిర్వహించారు. వార్డు ప్రజలు అభివృద్ధి, పారదర్శక పాలనకు మద్దతుగా ఇచ్చిన తీర్పుగా ఈ విజయాన్ని పార్టీ నాయకులు అభివర్ణించారు. గెలుపు అనంతరం స్పందించిన పత్రి లలిత రామకృష్ణ తనపై నమ్మకం ఉంచిన ప్రతి ఓటరికి కృతజ్ఞతలు తెలుపుతూ, ఎన్నికల హామీలను నెరవేర్చేందుకు కట్టుబడి ఉంటానని, 1వ వార్డు సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ ఫలితం స్థానిక రాజకీయాల్లో మార్పుకు సంకేతమని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

## నారాయణఖేడ్‌లో 'కేఫే బైసన్' ఘన ప్రారంభం జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ మచ్చేందర్ హాజరు



నారాయణఖేడ్ ఫిబ్రవరి 15(సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్)నారాయణ ఖేడ్ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డుపై నూతనంగా ఏర్పాటు చేసిన 'కేఫే బైసన్' హోటల్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. నారాయణఖేడ్ మండలం సంజీవన్రావుపేట గ్రామానికి చెందిన నాగారం శ్రీనివాస్ కుమారుడు బన్నీ, తుమ్నూర్ దామోదర్ రెడ్డి సంయుక్తంగా ఈ హోటల్‌ను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన గుట్టపు మచ్చేందర్ రిబ్బన్ కట్ చేసి హోటల్‌ను ప్రారంభించి యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు. వ్యాపారంలో విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే కేంద్రంగా అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి నాయకులు కర్ణం రాజు, ఉప్పరి బాల్రాజ్ సాగర్, ప్రహ్లాద్, శ్రీకాంత్, సుధాకర్, వాసు రాథోడ్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నారాయణఖేడ్‌లో 'కేఫే బైసన్' ఘన ప్రారంభం జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ మచ్చేందర్ హాజరు



నారాయణఖేడ్ ఫిబ్రవరి 15(సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్)నారాయణ ఖేడ్ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డుపై నూతనంగా ఏర్పాటు చేసిన 'కేఫే బైసన్' హోటల్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. నారాయణఖేడ్ మండలం సంజీవన్రావుపేట గ్రామానికి చెందిన నాగారం శ్రీనివాస్ కుమారుడు బన్నీ, తుమ్నూర్ దామోదర్ రెడ్డి సంయుక్తంగా ఈ హోటల్‌ను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన గుట్టపు మచ్చేందర్ రిబ్బన్ కట్ చేసి హోటల్‌ను ప్రారంభించి యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు. వ్యాపారంలో విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే కేంద్రంగా అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి నాయకులు కర్ణం రాజు, ఉప్పరి బాల్రాజ్ సాగర్, ప్రహ్లాద్, శ్రీకాంత్, సుధాకర్, వాసు రాథోడ్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




## నారాయణఖేడ్‌లో లారీ డ్రైవర్ అనుమానాస్పద మృతి – కుటుంబసభ్యుల ఫిర్యాదు

నారాయణఖేడ్ ఫిబ్రవరి 15( సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్)సంగారెడ్డి జిల్లా నారాయణ ఖేడ్ పట్టణంలోని ఏఎస్ నగర్‌లో లారీ డ్రైవర్ వాంక్డోత్ రమేష్ (32) అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. కుటుంబసభ్యుల వివరాల ప్రకారం, రమేష్ తన భార్య, ముగ్గురు పిల్లలతో కిరాయికి ఉంటూ జీవనం సాగించేవాడు. శనివారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకున్న స్థితిలో కనిపించాడని తెలిపారు. గత కొంతకాలంగా దాంపత్య వివాదాలు కొనసాగుతున్నట్లు, మృతికి ముందు రాత్రి కుటుంబంలో గొడవ జరిగిందని ఆరోపించారు. కొందరు వ్యక్తులు రమేష్‌పై దాడి చేసి, మానసిక ఒత్తిడి కలిగించారని కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మృతుడి తల్లి వాంక్డోత్ సంతుబాయి పోలీసులను కోరారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నం. : TGTEL/25/A0348 , టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ–మెయిల్ : sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్ : www.sandeshamtimes.com,ముద్రణ (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు,ఆంధ్రప్రదేశ్ – 522006.